# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-1 7, నవంబరు, 2014

ఆర్ అండ్ బి, పంచాయతిరాజ్ పరిధిలోని రోడ్లన్నీ నూటికి నూరు శాతం బాగుపడాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అధికారులను ఆదేశించారు. రోడ్ల నిర్మాణం, మరమ్మత్తులు, అభివృద్ధి, విస్తరణ తదితర కార్యక్రమాలన్నీ డిసెంబర్ మొదటి వారంలో ప్రారంభం కావాలని, ఎట్టి పరిస్థితుల్లో త్వరితగతిన పనులు పూర్తి కావాలని చెప్పారు. నవంబర్ నుండి మే వరకు వర్షాలు ఉండవు కాబట్టి, ఆ సమయంలోనే పనులన్నీ పూర్తి చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. మంత్రి వర్గ ఉప సంఘం చేసిన సూచనలు, రెండు శాఖల అధికారులు రూపొందించిన ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి శుక్రవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి డా.టి.రాజయ్య, మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, కె.టి.రామారావు, పోచారం శ్రీనివాసరెడ్డి, టి.హరీష్‌రావు, ఈటల రాజేందర్,జగదీష్ రెడ్డి, మహేందర్‌రెడ్డి, జోగురామన్న, యంపి బాల్కసుమన్, అధికారులు రేమాండ్ పీటర్, ఎస్.నర్సింగరావు, రవీందర్ రావు, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ సమావేశాలు పూర్తయ్యాక మంత్రులంతా జిల్లాల్లోనే పర్యటించాలని, డిసెంబర్ మొదటి వారం నుంచి యుద్ధ ప్రాతిపదికన జరిగే చెరువుల పునరుద్ధరణ, రహదారుల నిర్మాణం పనులను పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. తాను కూడా వచ్చే నెల నుండి హెలికాప్టర్ ద్వారా రాష్ట్రంలో విస్తృతంగా పర్యటిస్తానని చెప్పారు. పెద్ద ఎత్తున రహదారుల పనులు చేపడుతున్నాం కాబట్టి ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, అవసరం అనుకుంటే ఓ ఏడాది పాటు రిటైర్డు ఉద్యోగులను కాంట్రాక్టు పద్ధతిలో తీసుకోవాలని చెప్పారు. ఇంజనీర్లు విస్తృతంగా పర్యటించాల్సి వస్తుంది కాబట్టి డిఇ స్థాయి అధికారి వరకు వాహన సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. ఏఇ, కింది స్థాయి అధికారులకు ఎఫ్‌టిఎ మంజూరు చేస్తామని చెప్పారు. రెండు శాఖల్లో ఉన్న పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని ఆదేశించారు. రహదారుల నిర్మాణాల విషయంలో ఇప్పటి వరకు నిర్లక్ష్యానికి గురైన నియోజకవర్గాలకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. ప్రతి జిల్లా కేంద్రం నుండి హైదరాబాద్‌కు నాలుగు లైన్ల రోడ్డు, ప్రతి మండల కేంద్రం నుండి జిల్లా కేంద్రానికి రెండు లైన్ల రోడ్డు ఉండి తీరాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

పంచాయతిరాజ్ పరిధిలోని 14,500 కిలోమీటర్ల రహదారులకు మరమ్మత్తులు చేయాలని, 4,160 కిలోమీటర్ల మెటల్ రోడ్లను బిటి రోడ్లుగా మార్చాలని, 20 వేల కిలోమీటర్ల మట్టి రోడ్లను

అభివృద్ది చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మొత్తం పిఆర్ పరిధిలోని 38,500 కిలోమీటర్ల మెర రోడ్లను అభివృద్ధి చేస్తామని, సగటున నియోజకవర్గానికి 385 కిలోమీటర్ల రోడ్లు బాగుపడతాయని సిఎం వెల్లడించారు. బ్రిడ్జిలు, కాజ్‌వేల నిర్మాణానికి రూ. 250 కోట్లు ఖర్చవుతాయని అధికారులు అంచనావేశారు. ఆ పనులు కూడా వెంటనే పూర్తి చేయాలని సిఎం ఆదేశించారు. పిఆర్ పరిధిలో రూ. 700 కోట్ల బకాయిలు వున్నాయని, వాటిని వెంటనే చెల్లించాలని చెప్పారు. ఈ పనులకు సంబంధించి ఈ ఏడాది బడ్జెట్‌లో పెట్టిన డబ్బులతో పాటు వచ్చే బడ్జెట్‌లో కూడా కేటాయింపులు ఉంటాయని సిఎం వెల్లడించారు.

ఆర్ అండ్ బి పరిధిలో అధికారులు రూపొందించిన అంచనాలు ఇలా ఉన్నాయి.

- 10 వేల కిలోమీటర్ల రహదారుల మరమ్మత్తులకు రూ. 2400 కోట్లు.
- జిల్లా కేంద్రానికి డబుల్ లైన్ రోడ్డు లేని 149 మండల కేంద్రాలకు 2000 కిలోమీటర్ల మెర డబుల్ లైన్ రోడ్డు నిర్మాణానికి రూ. 2589 కోట్లు.
- 1500 కిలోమీటర్ల మెర సింగిల్ రోడ్లను డబుల్ రోడ్లుగా మార్చడానికి రూ. 1500 కోట్లు.
- గోదావరి, కృష్ణా నదులపై వంతెనలు నిర్మించడానికి రూ. 1445 కోట్లు.
- బ్రిడ్జిలు, కల్వర్టుల నిర్మాణానికి రూ. 1500 కోట్లు.
- నిజామాబాద్ – డిచ్‌పల్లి, ఖమ్మం – సూర్యాపేట రహదార్లను నాలుగు లైన్ల రోడ్లుగా మార్చడానికి రూ. 410 కోట్లు.
- వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, గజ్వేల్‌ల చుట్టూ రింగు రోడ్ల నిర్మాణానికి రూ. 1550 కోట్లు.
- రాజీవ్ రహదారి అభివృద్ధికి రూ. 750 కోట్లు.
- పెండింగ్ బిల్లుల చెల్లింపుకు రూ. 50 కోట్లు.

ఈ పనులన్నింటిని వెంటనే చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఒకటి రెండు రోజుల్లోనే అంచనాల తయారీ పూర్తి చేసి వారంలోగా టెండర్లు పిలవాలన్నారు. 15వ రోజున టెండర్లు ఖరారు చేయాలని, ఆ మరుసటి రోజే పని ప్రారంభం కావాలని ఆదేశించారు. నవంబర్ నెలాఖరు లోగా ఈ ప్రక్రియ అంతా పూర్తి చేసి డిసెంబర్ మొదటి వారంలో పనులు ప్రారంభించాలని ఆదేశించారు. టెండర్లు పూర్తయి ప్రారంభం అయిన పనులు మే నెలాఖరు వరకు పూర్తి కావాలని చెప్పారు. పనులు వేగంగా పూర్తి కావడంతో పాటు నాణ్యత విషయంలో కూడా అధికారులే బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు.

---

సిపిఆర్ఓ టు సిఎం